క్లుప్తంగా

నేడు నల్లకొండమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


నాతవరంలో వెలసిన అమ్మవారు

నాతవరం : గ్రామస్తులు ఆరాధ్య దైవంగా పూజించే నల్లకొండమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం తెల్లవారు నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేద పండితులతో పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. నాతవరం ప్రజలు గ్రామ దేవతగా నల్లకొండమ్మను పూజిస్తుంటారు. అమ్మవారి దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రానుండడంతో ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అందరికీ ఉచితంగా తీర్థప్రసాదాలు అందిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ధర్మవరంలో వైద్య పరీక్షలు

రావికమతం : 100 రోజుల టీబీ ప్రోగ్రామ్‌లో భాగంగా కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ధర్మవరం గ్రామంలో బుధవారం ఎఫ్‌డీపీ క్యాంప్ నిర్వహించారు. ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న 10 మందిని గుర్తించి వారికి డాక్టర్ మోహిని సురేఖ వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహిని సురేఖ గ్రామంలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. పొగాకు, ఆల్కహాల్ వంటివి విడిచిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో పాతాళ రామారావు, వైద్య సిబ్బంది లక్ష్మి, కృష్ణవేణి, ఆశాలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి


పాకలపాడు గ్రామంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రేవతమ్మ


గొలుగొండ : ప్రతి గ్రామంలో ప్రజలంతా మంచి మార్గంలో నడవాలని, చెడు మార్గాలపై వెళ్లవద్దని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. పాకలపాడు గ్రామంలో బుధవారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు గంజాయి వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గంజాయి అమ్మకాలు, కొనుగోలు, వినియోగం నిరోధానికి గట్టి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. యువత పెడమార్గం పట్టకుండా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలు గురించి ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో గొలుగొండ ఎస్ఐ రామారావు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా నాగవల్లి సంబరాలు


హోమం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో నిర్వహిస్తున్న కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి 15 వ వార్షిక కళ్యాణోత్సవాలు ముగింపు కార్యక్రమం నాగవల్లి సంబరాలు బుధవారం నిర్వహించారు. ఆలయం వద్ద హోమాలు, పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి, చక్రస్నానం, వసంతోత్సవం, స్వామివారికి పూజలు నిర్వహించారు. రాత్రికి ఊంజల్ సేవ, పుష్పంజలి సేవ, దర్పణదర్శనంతో ఉత్సవాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు, ఉత్సవ కమిటీ కన్వీనర్ కాళ్ల అప్పలనాయుడుతో పాటు మండల విశ్వహిందూ పరిషత్ కోశాధికారి జగ్గారావు, కాళ్ల అచ్చిమినాయుడు, రాముతో పాటు శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయ పనులు వేగవంతం


ఆలయ నిర్మాణం పనులు చేపడుతున్న గ్రామస్తులు

కె.కోటపాడు : పాచిలవానిపాలెం గ్రామంలో మరిడిమాంబ ఆలయ నిర్మాణం పనులను శరవేగంగా జరుపుతున్నారు. ఇప్పుడు ఉన్న మరిడిమాంబ అమ్మవారి ఆలయం జీర్ణావస్థకు చేరుకుంది. దీంతో ఆలయ పరిసరాల్లోనే నూతనంగా మరిడిమాంబ ఆలయ నిర్మాణాన్ని జరిపేందుకు గ్రామస్తులు సంకల్పించారు. ఆలయ నిర్మాణానికి రూ.20 లక్షలు అవసరం కానున్నట్టు వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ తెలిపారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం... రైతుకు ఏదీ సాయం..!

- వరి నారుమడులు సిద్ధం..
- రైతు సేవా కేంద్రాలకు ఇంకా రాని విత్తనాలు
- అన్నదాత సుఖీభవ కోసం రైతుల ఎదురుచూపులు


సత్యవరంలో రైతు సేవా కేంద్రం


సత్యవరంలో తడిచిన రబీ ధాన్యాన్ని సంరక్షిస్తున్న రైతులు

మాడుగుల : ఖరీఫ్‌కు సంబంధించి వర్షాలు అనుకూలించడంతో జిల్లా రైతులు ముందుగానే వరి ఆకుమడులతో పాటు వేసవి దుక్కులు సిద్ధం చేసుకున్నారు. కాకీ ఇంకా విత్తనాలు రైతు సేవా కేంద్రాలకు రాకపోవడంతో అదునులో విత్తనాలు వేసుకోలేమోనని రైతులు ఆందోళన చెందుతన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి లక్షా 55 వేల ఎకరాల్లో వరి సాగు చేయడానికి రైతులు వరి నరుమడులు సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో 450 రైతు సేవా కేంద్రాలుకు ఇంకా విత్తనాలు సరఫరా కాలేదు. మరోవైపు వ్యవసాయ పనులు ప్రారంభమైనా అన్నదాత సుఖీభవ కింద రైతులకు అందించే పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

తడిసిపోతున్న రబీ ధాన్యం

మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు తరుచూ రావడంతో రబీ వరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో మాడుగుల మండలంలో పాటు రావికమతం, దేవరాపల్లి, చీడికాడ, బుచ్చయ్యపేట, తదితర మండలాలులో సుమారు 10 వేల ఎకరాల్లో పంట కోసి నూర్పిడి చేసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. జిలాల్లో ఈ ఏడాది రబీకి సంబంధించి 50 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారుల ఇష్టారాజ్యంగా మారింది. ధాన్యం తడిచి పోవడంతో రంగు మారి ధరలు పలకవని, పెట్టుబడి పోయిందని, రైతులు దిగులు చెందుతున్నారు. రబీకి కూడా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అదును దాటిపోతుందా...

రైతులు ఖరీఫ్ వరి ఆకుమడులు తయారు చేసుకుని అదును కోసం ఎదురు చూస్తున్నారు. కానీ విత్తనాలు ఇంకా రైతు సేవా కేంద్రాలకు సరఫరా కాలేదు. ఖరీఫ్ సీజన్‌కు 10 రోజుల ముందు విత్తనాలు రైతులు వద్ద ఉంటే అదునులో విత్తనం వేసుకోగలమని అన్నదాతలు చెబుతున్నారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి మోహనరావును సంప్రదించగా ఖరీఫ్‌కు జిల్లాలో 23 వేల టన్నులు ఇండెంట్ పెట్టామని తెలిపారు. మరో వారం రోజుల్లో వరి విత్తనాలు రైతు సేవాకేంద్రాలకు అందజేస్తామన్నారు. సిబ్బంది బదిలీల ప్రక్రియ వల్ల కొంత ఆలస్యమైందని, వారం రోజుల్లో విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

రబీకి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



రబీలో పంట చేతికొచ్చే దశలో వర్షాలు కువరడం వల్ల నూర్చిన ధాన్యం తడిసిపోతున్నాయి. మాది 40 ఎకరాల్లో ధాన్యం తడిసిపోయింది. రబీలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల మద్దతు ధరలు పలకలేదు. టన్ను రూ.16వేల నుంచి రూ.18 వేలకు అడుగుతున్నారు. టన్ను రూ.24 వేల మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవాలి.

– నాగేశ్వరరావు, రైతు, సత్యవరం

సందడిగా ఏరువాక పౌర్ణమి


చోడవరం-పీఎస్‌పేట రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు


లక్ష్మీపురంలో ఏరువాక పౌర్ణమిలో ఎద్దులతో దుక్కు దున్నుతున్న ఎమ్మెల్యే రాజు

పీఎస్‌పేట రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే రాజు

చోడవరం : వ్యవసాయానికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో భాగంగా లక్ష్మీపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎద్దులతో దుక్కులు దున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయం అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. రైతులకు త్వరలో అన్ని పథకాలు అందుతాయన్నారు. అనంతరం రూ. కోటితో నిర్మించిన చోడవరం-పీఎస్‌పేట రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రనాథ్, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు కనిశెట్టి మచ్చిరాజు, పట్టణ అధ్యక్షుడు యర్రంశెట్టి చిన్న, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్ పాల్గొన్నారు.

35 మందికి కంటి పరీక్షలు

రావికమతం : కొత్తకోట గ్రామంలో శ్రీ వేంకటేశ్వర పుష్పగిరి ఆస్పత్రి సౌజన్యంతో పతివాడ చిన్నంనాయుడు కుమారుడు ధనుంజయ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి 35 మంది రోగులు హాజరయ్యారు. వీరికి డాక్టర్‌లు పావని, కావ్య కంటి పరీక్షలు చేశారు. వీరిలో 20 మందికి ఆపరేషన్లు అవసరంగా గుర్తించారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందచేశారు. ఆపరేషన్‌కు అవసరమైన 20 మందికి శ్రీ వేంకటేశ్వర పుష్పగిరి ఆస్పత్రికి తరలించారు.

వేణుగోపాలస్వామి ఉత్సవాలు ప్రారంభం

మాడుగుల : పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఆలయ పూజారి వాడపల్లి శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరగనున్నాయన్నారు. సాయంత్రం ఈ కార్యక్రమంలో పుట్టా మురళీ కృష్ణ, జాగాని లీలావతి, జాగాని పద్మ, లోకేశ్వరి, వాలంకి వరలక్ష్మి, జాగాని వెంకన్న బాబు పాల్గొన్నారు.

టైప్-4 కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు


హెచ్‌ఎం నాగేశ్వరరావు

రోలుగుంట : జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల అవరణలో గల టైపు-4 కేజీబీవోల ప్రవేశాలకు 9,10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో చేరేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఇక్కడ ఇటీవల బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో విద్యాశాఖ నిబంధనల మేరకు తల్లి లేదా తండ్రి ఒక్కరే ఉన్న పిల్లలు, మధ్యలో బడి మానేసిన పేద కుటుంబాల పిల్లలకు వారి అర్హతల ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల సిబ్బందిని గాని, 9908035375 ఫోన్ నంబర్లో సంప్రదించవచ్చని సూచించారు.

సర్కారు బడులు నేడు పునఃప్రారంభం


మాడుగుల జిల్లాపరిషత్ హైస్కూల్


బుచ్చెయ్యపేటలో పలు పాఠశాలలకు పుస్తకాలు తరలిస్తున్న ఉపాధ్యాయులు

మాడుగుల/మాడుగుల రూరల్ : మండలంలో ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయని, ఎంఈవోలు ఎం.పాండురంగారావు, బి.దేముడమ్మ తెలిపారు. పాఠశాల ప్రారంభం రోజునే, పుస్తకాలు, ఏకరీతి దుస్తు లు అందజేయనున్నామన్నారు. హైస్కూల్స్‌కు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు కూడా అందజేయనున్నామన్నారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు విధుల్లో జాయిన్ అవుతారని వారు తెలిపారు.

రోలుగుంట : వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ అవసరమైన సూచనలు చేశారు. ఉపాధ్యాయులు విధిగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఎస్‌జీటీ, ఎంటీఎస్ ఉపాధ్యాయులు పాఠశాలల పునఃప్రారంభం రోజున విధిగా రిపోర్టు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఇప్పటికే అన్ని పాఠశాలలకు బియ్యం కొత్త స్టాక్ పంపించడం జరిగిందన్నారు.

బుచ్చెయ్యపేట : మండలంలో 48 ప్రైమరీ పాఠశాలలు, 5 యుపీ స్కూళ్లు, 8 హైస్కూళ్లు, కేజీబీవీ పాఠశాల మొత్తం 62 పాఠశాలలున్నాయి. ప్రతి ఏటా నాలుగు వేల మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరి విద్యాభ్యాసం సాగిస్తున్నారు. పాఠశాలలు తెరుచుకుంటున్నా నేటికీ విద్యార్థులకు అందించాల్సిన స్కూల్ బ్యాగులు, బూట్లు మండలానికి చేరలేదు. 43,412 టెస్ట్, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బెల్టులు వచ్చాయి. సుమారు 394 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా ప్రస్తుతం ఉపాధ్యాయులు బదిలీల్లో ఉన్నారు. కొత్త కొండెంపూడి, బుదిర్లపాలెం పాఠశాలలు శిథిలమై కూల్చేయగా నేటికీ సొంత భవనాలు లేక పరాయి పంచన నడుస్తున్నాయి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తయారీదారులకు గత ఏడాది బకాయిలు ఇవ్వకపోవడంతో వారంతా ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

రోలుగుంట : మండలంలో గల అన్ని పాఠశాలలకు పాఠ్య, నోట్ పుస్తకాలు, దుస్తులు తదితర మెటీరియల్‌ను మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో తరలిస్తున్నారు. మండలంలో ఎంపీపీ, యూపీ, జెడ్పీ ఉన్నత పాఠశాలలు 54 పాఠశాలలు, కేజీబీవీతో కలసి 55 పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు 12,433, నోట్ పుస్తకాలు 15,640, యూనిఫామ్ దుస్తులు -2387, డిక్షనరీలు-231, బెల్టులు-1549 రాగా మండలంలోని ఆయా పాఠశాలలకు వాహనాలపై తరలించారు.

డిప్యూటీ ఎంపీడీవో, ఏవోలకు బదిలీ

మాకవరపాలెం : డిప్యూటీ ఎంపీడీవో సీతామహాలక్ష్మి, వ్యవసాయ అధికారి చిరంజీవి బదిలీ అయ్యారు. ఐదేళ్లుగా వీరిద్దరూ మండలంలో పనిచేస్తున్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో సీతామహాలక్ష్మిని అల్లూరి జిల్లా చింతపల్లి, చిరంజీవికి రోలుగుంట మండలాలకు మదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. అలాగే వజ్రగడ, మల్లవరం, బయ్యవరం, పెద్దిపాలెం పంచాయతీ కార్యదర్శులకు కూడా బదిలీ అయిందని ఎంపీడీవో చాయాసుధ బుధవారం తెలిపారు.

బదిలీపై ఫైర్ సిబ్బంది రాక

మాడుగుల : స్థానిక అగ్నిమాపక కేంద్రానికి ఎల్ఎఫ్‌లుగా ఎల్.వెంకటరావు, డి.అర్జున, ఫైర్‌మన్ టీఐ షఫీలు బుధవారం బాధ్యతలు చేపట్టారు. వెంకటరావు విశాఖ నుంచి, అర్జున, షఫీలు మర్రిపాలెం అగ్నిమాపక కేంద్రాల నుంచి బదిలీపై వచ్చారని ఫైర్ అధికారి రాజేశ్వరరావు తెలిపారు. ఇక్కడ ఎల్ఎఫ్‌లుగ పని చేసిన సీహెచ్ కృష్ణ, టి.శ్రీనివాసరావు మర్రి పాలెం బదిలీపై వెళ్లారు.

దుర్గామల్లేశ్వర ఆలయ వార్షికోత్సవం

మాకవరపాలెం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గల దుర్గామల్లేశ్వర దేవస్థానంలో పదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు పూజల్లో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, గ్రామ పెద్దలు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మల్లికార్జునశర్మ పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ ప్రారంభం

మాకవరపాలెం : రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీపై వరి విత్తనాలు పంపిణీ ప్రారంభించామని వ్యవసాయశాఖ నర్సీపట్నం ఏడీ శ్రీదేవి తెలిపారు. మండలంలోని జంగాలపల్లిలో బుధవారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో కలసి దుక్కులు దున్నడంతో పాటు విత్తనాలు చల్లారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాయితీపై వ్యవసాయ పరికరాలను కూడా అందజేస్తామన్నారు. వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏవో చిరంజీవి, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల మంజూరు ఎప్పుడు..?

- తల్లికి వందనం, రైతుకు సాయం అందేనా..
- చౌడువాడ హైస్కూల్ సమీపంలో మద్యంషాపు మార్చాలి
- మండల సమావేశంలో ప్రస్తావించిన సభ్యులు


హైస్కూల్ సమీపంలో గల మద్యంషాపును మార్చాలని కోరుతున్న వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ

కె.కోటపాడు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా నేటికీ అర్హులైన వారికి సామాజిక పింఛన్లు మంజూరు చేయలేదని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీలు వర్రి రామునాయుడు, ఏటుకూరి రాజేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సూదివలస ఎంపీటీసీ వర్రి రామునాయుడు మాట్లాడుతూ సూదివలసలో రైతు భరోసా కేంద్రం నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం జరిగినా నేటికి ఆ భవనానికి విద్యుత్ కనెక్షన్‌ను ఇవ్వలేకపోవడం వల్ల నిరుపయోగంగా ఉందని అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం అవుతున్నా తల్లికి వందనం కార్యక్రమం అమలుపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో విద్యార్థుల తల్లులు ఆందోళన చెందుతున్నారని మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణను ప్రశ్నించారు. ఖరీఫ్ సాగు కాలం ప్రారంభమై ఆకుపోత పనులు చేపట్టేందుకు రైతులు సిద్ధమైనా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సహాయం ఇంకా అందించలేదని ఎంపీటీసీ వర్రి రామునాయుడు వ్యవసాయశాఖ అధికారులను ప్రశ్నించారు. గత ప్రభుత్వ కాలంలో రైతు భరోసా కింద అర్హులందరికీ పెట్టుబడి సహాయం అందించారని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సీహెచ్.అప్పలనాయుడును చౌడువాడ హైస్కూల్‌కు కొద్దిపాటి దూరంలో ఉన్న మద్యంషాపును వెంటనే వేరే చోటకు మార్చు చేయాలని సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ కోరారు. పాఠశాలకు సమీపంలోనే మద్యం షాపు ఉండడం ఆ దారిలో సమీప గ్రామాలకు వెళ్లే మహిళలకు ఇబ్బందికరం అని తెలిపారు. సమావేశంలో ప్రస్తావించిన సమస్యలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ జగన్‌మోహన్ కోరారు. కె.కోటపాడుకు లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మ్యాన్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని విద్యుత్ అధికారులకు ఆయన సూచించారు. సమావేశంలో ఎంపీడీవో సాంబశివరావు, సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, ఎంపీటీసీలు చీపురపల్లి అచ్చిబాబు, లెక్కల గౌతమి, గొర్రుపోటు రామలక్ష్మి, నెక్కల గోపి పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి పంచాయతీ అనుమతి తప్పనిసరి


విలేకర్లతో మాట్లాతున్న సర్పంచ్, జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు సుజాత

గొలుగొండ: మండలంలో ఏకైక మేజర్ పంచాయతీ అయిన ఏఎల్‌పురం(కృష్ణదేవిపేట) గ్రామంలో ఇంటి నిర్మాణాలు చేసే ప్రతి ఒక్కరూ పంచాయతీ అధికారుల అనుమతులు తీసుకోవాలని సర్పంచ్ లోచల సుజాత, ఇన్‌చార్జి పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. సుమారుగా 8వేలకుపైగా ఉన్న గ్రామ పంచాయతీలో నిత్యం డ్రైనేజీ సమస్య ఉందని, దీని కారణం ఇంటి నిర్మాణాలు చేసే యజమానులు డ్రైనేజీపై నిర్మాణాలు చేపట్టడమేనని అన్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఇక నుంచి ఇంటిని నిర్మాణం చేసేవారు తప్పకుండా అనుమతులు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా డ్రైనేజీ సమస్య వచ్చిందని ఈ సమస్య పరిష్కారం కోసం మూడు రోజుల నుంచి ముమ్మరంగా పారుశుధ్య పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. మండల కేంద్రం పాత వీధుల్లో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 98 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రసన్న మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున తాగునీటి పథకాలు బోర్లు, కుళాయిల్లో నీరు క్లోరినేషన్ చేశాక తాగాలన్నారు. కాచి చల్లార్చిన నీళ్ల తాగడం శ్రేయస్కరం అన్నారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో జ్వరాలు వ్యాపిస్తే వెంటనే సమాచారం ఇస్తే వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

గొలుగొండలో పారిశుధ్య చర్యలు

గొలుగొండ : మండల కేంద్రంలో ముమ్మరంగా పారుశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో శ్రీరాంపురం, కొత్తజోగుంపేట, 80 కాలనీ, ఎస్సీ కాలనీ పరిధిలో కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తీయిస్తున్నారు. సర్పంచ్ కసిపల్లి బుజ్జి(అప్పారావు) పంచాయతీ కార్యదర్శి రమణ పనులను పర్యవేక్షిస్తున్నారు. పూడికను ట్రాక్టర్లపై తరలించి పూర్తి స్థాయిలో ప్రజలకు పారిశుధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు పంచాయతీ పాలకులు తెలిపారు.